క్లుప్తంగా

వైభవంగా గ్రామోత్సవం



పాత గుంటూరు: స్తంభాల గరువులోని శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పి. కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఉదయం షడ్వైష్ణవ హోమం, నారాయణోపనిషత్, పూర్ణాహుతి కార్యక్రమాల్ని అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం స్వామి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పతాక అవరోహణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్ని ఆలయ కార్యదర్శి చల్లా జగన్నాథరెడ్డి, కోశాధికారి ఉడుముల శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శి భీమినేని రాంబాబు, సభ్యులు పర్యవేక్షించారు.

నేడు రాధామాధవ 'నెలనెలా వెన్నెల'

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై రాధా మాధవ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 299వ నెలనెలా వెన్నెల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాధామాధవ నాట్యక్షేత్రం నాట్యాచార్య షేక్ ఖలీల్ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో గురజాలకు చెందిన పులుసు అనుష్క ఆనంద ఆరంగేట్రం(కూచిపూడి రంగ ప్రవేశం) జరుగుతుందని తెలిపారు. కళాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



పాత గుంటూరు: కొరిటెపాడు గాంధీ బొమ్మ సెంటర్‌లోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామనవమి కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం స్వామికి సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, ప్రత్యేక హారతులు తదితర కార్యక్రమాల్ని వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం నాట్యాచార్య డాక్టర్ కాజ వెంకట సుబ్రహ్మణ్యం శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహాగణపతి, అదిగో అల్లదిగో, గరుడ గమన పలు అంశాలకు చిన్నారులు నృత్యం చేశారు. కార్యక్రమాల్ని ఆలయ అధ్యక్షుడు కొమ్మినేని శివ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కిలారి ఆదినారాయణ, కార్యదర్శి కొమ్మినేని ప్రసాద్, సభ్యులు కొమ్మినేని కోటేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, పి. శ్రీనివాస్ పర్యవేక్షించారు

చక్కటి సమయపాలనతోనే పరీక్షల్లో విజయం



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు చక్కటి సమయపాలనతో టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరవ్వాలని పొగాకుబోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో శనివారం పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏడాది పొడవునా ఎంతో శ్రమించి, పట్టుదలతో చదివిన విద్యార్థులు పరీక్షలు జరిగే రోజుల్లో ఆందోళనకు తావులేని ప్రశాంత వాతావరణంలో చక్కగా రాయాలని సూచించారు. ప్రతి క్రికెటర్ తన చివరి ఓవర్‌లో శక్తిని కూడగట్టుకుని ఏ విధంగా పోరాడతారో, విద్యార్థులు సైతం అదే విధంగా తమలోని మేధస్సుకు పదునుపెట్టి పరీక్షల్లో అధిక మార్కుల సాధనకు కృషి చేయాలని తెలిపారు. జీవితంలో 10వ తరగతి సర్టిఫికెట్ ఎంతో ముఖ్యమైనదని, సాధించిన మార్కులు జీవితాంతం గుర్తుండిపోతాయని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం రాంబాబు, ఇన్‌చార్జ్ ఎం. విలియమ్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో మళ్లీ విజయమే లక్ష్యం

- ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్
- ప్రభుత్వం చేస్తున్న మంచి పనుల్ని ప్రజలకు తెలియజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిరి

పట్నంబజారు: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉన్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ చెప్పారు. పట్టాభిపురంలోని మౌలానా అబుల్‌కలాం అజాద్ షాదీఖానాలో శనివారం నియోజకవర్గం డివిజన్ కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశం నిర్వహించారు.ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడులతో కలసి పలు అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గిరి మాట్లాడుతూ గుంటూరు నగరం అభివృద్ధి దిశలో పరుగులు తీస్తోందని తెలిపారు. మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి తనయుడిగా, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. ప్రతి ఒక్కరిని కుటుంబ సభ్యుడిగా భావించి రాష్ట్ర ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సీఎం వై.ఎస్.జగన్ ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజలకు సుపరిపాలన అందుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సచివాలయ కన్వీనర్లకు సూచించారు. డివిజన్ కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు వారికి కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి ప్రభుత్వం చేస్తున్న మంచి పనిని ప్రజలకు చేరువ చేయాలని తెలిపారు. నూతన ఉత్తేజంతో పార్టీ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో సైతం సీఎం వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని తిరిగి స్థాపించాలని చెప్పారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన 99 శాతం హామీల్ని అమలు చేసిన సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. మాట ఇస్తే తప్పకుండా, చెప్పాడంటే చేస్తాడంతే అని పేరు తెచ్చుకున్న సీఎం వై.ఎస్.జగన్ అని కొనియాడారు. రాష్ట్రంలో అత్యంత ప్రతికూల పరిస్థితులు ఉన్నా, ఆర్థిక పరిస్థితి అత్యంత దారుణంగా ఉన్నా, కోవిడ్ వంటి వైపరీత్యాలు ఎదురొచ్చినా, దేన్నీ లెక్కచేయకుండా ప్రజలకు ఇచ్చిన మాట కోసం సంక్షేమ పాలన అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందని వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న మంచి పరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లపై ఉందని సూచించారు. నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు మాట్లాడుతూ ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తూ దేశంలోనే అగ్రభాగాన నిలుస్తోందని తెలిపారు. ఇతర రాష్ట్రాలు సైతం రోల్‌మోడల్‌గా తీసుకునేవిధంగా సీఎం జగన్ పాలన చేస్తున్నారని పేర్కొన్నారు. నగరంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కోట్ల రూపాయలతో చేపట్టామని, భవిష్యత్తులో సైతం మరిన్ని చేపట్టబోతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్ని ప్రతి గడపకు తీసుకెళ్లి కూలంకుషంగా సీఎం జగన్ చేస్తున్న మంచిని వివరించాలని చెప్పారు. అనంతరం ఎమ్మెల్సీగా ఎన్నికైన చంద్రగిరి ఏసురత్నంను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, యోగేశ్వరరావు, గురవయ్య, ఉమామహేశ్వరి, అడకా పద్మావతి, రోషన్, అద్దాల వెంకటరెడ్డి, అందుగల సంతోష్, బూసిరాజలత, ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎక్కలూరి మారుతి, గోడపాటి ఉషారాణి, మల్లిబోయిన శ్రీవల్లి, డివిజన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

భావి శాస్త్రవేత్తలను పాఠశాలలే తయారుచేయాలి



ప్రాజెక్టులను తిలకిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: భారతదేశాన్ని శాస్త్రీయంగా అభివృద్ధి పర్చే క్రమంలో భావి శాస్త్రవేత్తల్ని పాఠశాలలే తయారు చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. శనివారం మల్లారెడ్డినగర్‌లోని సెంట్రల్ స్కూల్లో 23వ వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక ప్రాజెక్టులను తిలకించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాలు వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలు శాస్త్ర, సాంకేతిక అంశాలపై విద్యార్థులకు ఆసక్తి కలిగేలా ప్రదర్శన ఏర్పాటు చేయడంలో పాఠశాలల యాజమాన్యాలతో పాటు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆయన సూచించారు. పాఠశాల డైరెక్టర్ ఎస్వీ రామచంద్రరావు మాట్లాడుతూ పిల్లల్లో నైపుణ్యాల్ని వెలికితీసేందుకు ఏటా వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంపిటీషన్ సక్సెస్ కాలేజ్ డైరెక్టర్ ఎస్. రామన్, మాజీ కార్పొరేటర్ మాదా వెంకట ముత్యాలరావు, అకడమిక్ డైరెక్టర్ ఎస్.జ్ఞానశ్రీ, ప్రిన్సిపాల్ ఏ.దుర్గాదేవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలకు నాక్ ఏ ప్లస్ గుర్తింపు



నాక్ గుర్తింపు పత్రాన్ని చూపిస్తున్న ఆలపాటి రాజా, తిలక్‌బాబు, కోట శ్రీనివాసు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: పేరేచర్లలోని ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) ఏ ప్లస్ గుర్తింపు లభించినట్లు ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు తెలిపారు. విద్యానగర్‌లోని కళాశాల నగర కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2008లో ప్రారంభించిన ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలకు గ్రాడ్యుయేట్ కోర్సులతో పాటు ఎంటెక్, ఎంబీఏ వంటి పీజీ కోర్సులతో ప్రతి యేటా 85 శాతానికి పైగా ప్లేస్‌మెంట్స్ సాధిస్తూ, రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉందన్నారు. త్వరలోనే అటానమస్ స్టేటస్ సైతం లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. మే తరువాత ఎన్‌బీఏ గుర్తింపు సైతం సిద్ధమవుతున్నట్లు చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కళాశాలలో బోధనా విధానం, మౌలిక వసతులు, విద్యార్థుల ప్రగతి, తల్లిదండ్రుల సంతృప్తి, ఫలితాలు ప్లేస్‌మెంట్స్ ఆధారంగా నాక్ ఏ ప్లస్ ఆధారంగా ఏ ప్లస్ గుర్తింపు దక్కడం గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరిరావు, పరిపాలనాధికారి బండారు సీతారామయ్య, విభాగాధిపతులు కోటేశ్వరరావు, చంద్రమౌళి, కె. శ్రీనివాసరావు, నాగేంద్రబోస్ పాల్గొన్నారు.

ఇన్నర్ రింగ్ రోడ్డు పనుల్లో ముందడుగు

- స్వర్ణభారతి నగర్‌లో రోడ్డు ప్రభావిత వాసులతో సమావేశం
- పాల్గొన్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, కమిషనర్ కీర్తి చేకూరి
- బాధితులకు జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు..
- అందరికీ న్యాయం చేస్తామని భరోసా



స్వర్ణభారతీ నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, నగర కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు రూరల్: గుంటూరు నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ఇన్నర్ రింగ్ రోడ్డు చాలా కీలకమని, ఎంతో కాలం నుంచి పెండింగ్‌లో ఫేజ్ 3 పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కోరారు. శనివారం నగర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చేకూరి కీర్తి, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్ 3లో భాగంగా ఇళ్లు కోల్పోతున్న బాధితులను కలిసి, వారి సమస్యలు తెలుసుకున్నారు. వాటికి పరిష్కార మార్గాలు చూపారు. స్వర్ణభారతి నగర్‌లో పర్యటించారు. స్థానిక కమ్యూనిటీ హాల్లో స్థానికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుచరిత మాట్లాడారు. ఏళ్ల తరబడి కాల్వల వెంబడి, ప్రభుత్వ స్థలాల్లో అభద్రతా భావంతో జీవిస్తున్న వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పించిందన్నారు. స్వర్ణభారతి నగర్‌లో ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రతిపాదిత ప్రాంతాల్లోని కొందరు బీ ఫారం ఉన్న వారు, ప్రభుత్వ స్థలాలను, కాల్వ కట్టలను ఆక్రమించుకొని ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు. వారంతా రోడ్డు ఏర్పాటుకు సహకరించాలని కోరారు. నష్టపోతున్న వారికి జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామని తెలిపారు. చట్ట ప్రకారం ఆక్రమణలను తొలగించి పనులు చేపట్టే వీలున్నా, నగరపాలక సంస్థ అధికారులు కూడా రోడ్డు ఏర్పాటు వల్ల నష్ట పోయే ప్రతి ఒక్కరికీ న్యాయం చేసిన అనంతరమే పనులు ప్రారంభించాలన్నారు. బాధితులకు తగిన న్యాయం చేయడానికి నగరపాలక సంస్థ కౌన్సిల్‌లో తీర్మానం ద్వారా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఎమ్మెల్యే సూచించారు. స్థానికులు వారంలో జరిగే సమావేశం నాటికి ఆమోద పత్రాలు ఇవ్వాలని కోరారు. రోడ్డు ఏర్పాటుపై ఎలాంటి అనుమానాలున్నా ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్‌రోడ్డు పనులు పూర్తయితే గుంటూరు నగరంలో ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. స్థానికులు పూర్తిగా సహకరించాలని కోరారు. 80 అడుగుల వెడల్పుతో 4.21 కిలోమీటర్ల మేర ఇన్నర్ రింగ్ రోడ్డు ఏర్పాటు జరుగుతుందన్నారు. అందులో ఇప్పటికే 3.30 కిలో మీటర్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. స్వర్ణభారతి నగర్ వద్ద పనులు ఆగిపోయాయన్నారు. ప్రస్తుతం ఉంటున్న వారికి చట్ట ప్రకారం భూమిపై హక్కులు లేవని, వారికి జగనన్న కాలనీల్లో పక్కా రిజిస్ట్రేషన్ తో ఇంటి స్థలం ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు బి.స్మిత పద్మజ, వై.సాంబిరెడ్డి, ఆర్‌బీ డైరెక్టర్ పి.మేరి, ఎన్‌ఆర్‌జీఎస్ డైరెక్టర్ మనోహర్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ మూర్తి, గుంటూరు పశ్చిమ తహసీల్దార్ సాంబ శివరావు, ఏసీబీ బాబురావు, టీపీఎస్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసి ఖాతా నుంచి నగదు డ్రా

గుంటూరు ఈస్ట్: బ్యాంకు రుణం ఇప్పిస్తానని మోసం చేసి పెద్ద మొత్తంలో డబ్బులు డ్రా చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవాపురం 2వ లైనులో నివసించే చప్పిడి చిన్నమ్మకు నగరంపాలెం ఎస్‌బీఐ బ్యాంకులో అకౌంట్ ఉంది. ఆమె ఫిబ్రవరి 9వ తేదీ బ్యాంకు వెళ్లగా బెంగుళూరుకు చెందిన షేక్ ఫాతిమాగా ఓ మహిళ పరిచయం చేసుకుంది. బ్యాంకులో రుణం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి చిన్నమ్మను నమ్మించింది. ఆమెతో రెండు కాగితాలపై సంతకాలు తీసుకుంది. రుణం డబ్బులు మనియార్డర్ చేస్తానని చెప్పింది. మార్చి 13న చిన్నమ్మ, ఆమె కోడలు బ్యాంకుకు వెళ్లి పెన్షన్ డ్రా చేసే క్రమంలో బ్యాలెన్స్ చూసుకోగా, రెండు విడతలుగా రూ. 4.35 లక్షలు విత్‌డ్రా అయినట్లు తెలిసింది. ఫాతిమా మోసం చేసి డబ్బులు డ్రా చేసినట్లు గుర్తించి శనివారం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

పరిశోధనలపై ఆసక్తితో ఉన్నత విద్యావకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎన్‌యూ భౌతిక శాస్త్ర విభాగాధిపతి సంధ్య కోల్

గుంటూరు ఎడ్యుకేషన్: పరిశోధనలపై ఆసక్తిని పెంచుకోవడం ద్వారా విద్యార్థులు ఉన్నత విద్యావకాశాలను అందిపుచ్చుకోగలరని ఏఎన్‌యూ భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంధ్య కోల్ పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో శనివారం భౌతికశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో యూజీ, పీజీ విద్యార్థులకు ఉన్నత విద్య, పరిశోధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంధ్య మాట్లాడుతూ ఉన్నత విద్యకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, విద్యార్థులు గ్రాడ్యుయేషన్‌తోనే ఆగిపోకుండా పీజీతో పాటు పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. ఉన్నత విద్యాకోర్సుల్లో చేరిన వారికి పోటీ పరీక్షలకు అందించే శిక్షణ గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎం ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులందరూ పీజీ సెట్ రాసి, ఇష్టమైన బ్రాంచ్‌ను ఎంపిక చేసుకుని ఉన్నత విద్య దిశగా ముందుకు వెళ్లాలని సూచించారు. సదస్సులో పీజీ విభాగాధిపతి కె. శరత్ కుమార్, డిగ్రీ విభాగాధిపతి రాము, అధ్యాపకులు లలిత, ప్రసాద్, కళ్యాణి, రేణుక, శిరీష, పావని పాల్గొన్నారు.

నేడు కవి సమ్మేళనం

పాత గుంటూరు: నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ హాలులో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో కవి సమ్మేళనం అనంతరం లెనిన్ శ్రీనివాస్ రచించిన 'కలలు చెదిరిన కళ్లు' పుస్తకంపై సమీక్ష జరుగుతుందని పేర్కొన్నారు.

మహిళలకు మేలు చేస్తున్న జగనన్న ప్రభుత్వం

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి, ఎమ్మెల్సీ ఏసురత్నం తదితరులు

పట్నంబజారు: మహిళలు తిరగబడితే రాజ్యాలే తల్లకిందులు అవుతాయి అనేందుకు 2019 ఎన్నికలే ప్రత్యక్ష నిదర్శనమని, తమను దారుణంగా వంచించిన టీడీపీని వారు సంఘటితంగా ఇంటికి సాగనంపారని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. నగరంలోని 32, 33, 34, 35, 36, 38 డివిజన్లకు సంబంధించిన డ్వాక్రా గ్రూపు సభ్యులతో వైఎస్సార్ ఆసరా మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. పట్టాభిపురంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదీఖానాలో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ పిల్లలను బడికి పంపితే తల్లుల ఖాతాలో నగదు జమ చేసే కార్యక్రమం దేశంలో కాదు ప్రపంచంలోనే మరెక్కడా లేదని తెలిపారు. జగన్‌సీఎం అయిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు దక్కాయని, వాటిని కూడా మహిళల పేరిటే రిజిస్ట్రేషన్ చేయించడం ద్వారా సరికొత్త మహిళా స్వావలంబనకు తెరతీశారని పేర్కొన్నారు. ఇటువంటి సంక్షేమం పాలన కోసం మళ్లీ సీఎం జగనే కావాలన్న వాస్తవాన్ని గుర్తెరిగి, ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ మహిళలు బాగుంటే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్న విశ్వాసంతో సీఎం జగన్ ప్రతి పథకంలో వారిని విధిగా భాగస్వామ్యం చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా పథకాలు రూపొందించిన ఏకైక సీఎం వైఎస్ జగన్ సరికొత్త చరిత్ర సృష్టించారని చెప్పారు. అప్పుల ఊబిలో ఉన్నా డ్వాక్రా మహిళలకు వడ్డీ మాఫీ చేయడమే కాక రుణాలు కూడా మాఫీ చేసిన మంచి మనసున్న మారాజు సీఎం జగన్ అని కొనియాడారు. గత ప్రభుత్వం మహిళల్ని అన్ని విధాలుగా వంచించిందని, మళ్లీ మాయమాటలతో మోసం చేసేందుకు సిద్ధమవుతున్నారని, ఆ కుట్రల్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ముందుగా వైఎస్సార్ ఆసరా పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), ఉడుముల లక్ష్మి, బూసి రాజలత, డివిజన్ ఇన్‌చార్జిలు టీఎల్‌వీ వీరాంజనేయులు, దుగ్గెంపూడి వెంకట్రామిరెడ్డి, భోగిశం శిరీష, ఇన్నారెడ్డి పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న పదో తరగతి విద్యార్థులకు ప్రభు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సంగడిగుంటలో ఎగ్జామ్ ప్యాడ్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బిషప్ రెబ్బా విక్టర్‌పాల్ మాట్లాడుతూ విద్యార్థి దశలో టెన్త్ దశ ఒక టర్నింగ్ పాయింట్ వంటిదని తెలిపారు. పరీక్షలు చక్కగా రాసి తల్లిదండ్రులతో పాటు విద్య నేర్పిన గురువులకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు.